క్లుప్తంగా

వెంకన్న సన్నిధిలో ఎస్పీ విక్రాంత్



వాడపల్లిలో ఎస్పీ విక్రాంత్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న సిబ్బంది, అర్చకులు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామిని కాకినాడ ఎస్పీ విక్రాంత్ పాటిల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎస్పీ విక్రాంత్ కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించగా ఆలయ సంప్రదాయం ప్రకారం దేవస్థానం అధికారులు, అర్చకులు స్వాగతం పలికి స్వామి దర్శనానికి తోడ్కొని వెళ్లారు. పూజలు అనంతరం పండితులు వేదాశీర్వాదంతో స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

వైభవంగా లక్ష చామంతి పూజ

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామదేవత పళ్లాలమ్మ అమ్మవారికి శుక్రవారం సామూహిక లక్ష చామంతి పూజ వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఈఓ బొక్కా వీర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వానపల్లి పరిసర గ్రామాల భక్తులు సుమారు 253 కుటుంబాల వారు ఈ పూజలో పాల్గొన్నారు. పూజ అనంతరం సమీప గ్రామం బిళ్లకుర్రు శివారు వాకాడవారిపాలానికి చెందిన వాకాడ తిరుమలరావు సౌజన్యంతో అన్నసమారాధన నిర్వహించారు. ఈఓ వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ జీఎస్ భార్గవ, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పి.గన్నవరం: స్థానిక మూడు రోడ్ల సెంటర్ నుంచి పోతవరం వరకూ సీసీ రోడ్డు నిర్మిస్తున్న నేపథ్యంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్పు చేస్తున్న కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ జీవీ ఆచార్యులు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉన్నత పాఠశాలకు బీరువా బహూకరణ



లూటుకుర్రు స్కూల్‌కు బీరువాను బహూకరించిన పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: లూటుకుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1986–87లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం స్కూల్‌కు బీరువాను బహూకరించారు. ఈ బీరువాను స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.నాగప్రసాద్‌కు అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ స్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం మరువరానిదన్నారు. స్కూల్ అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు కీలక పాత్ర వహిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాంబాబు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయ స్థానం



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు

రాజోలు: కోనసీమ క్రీడోత్సవాల్లో భాగంగా నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో కడలి ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా స్థాయిలో రన్నర్స్‌గా నిలిచిన వడ్లమూడి శ్రీలక్ష్మీజ్యోతి, కవురు మిధునశ్రీలను ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎస్ శర్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు. విద్యా కమిటీ చైర్మన్ వడ్లమూడి ప్రకాశరావు, వ్యాయామోపాధ్యాయుడు ధర్మశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత



సంధిపూడిలో నాగేశ్వరరావు కుటుంబానికి సాయం అందిస్తున్న ప్రజా ప్రతినిధులు

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఖండవల్లి నాగేశ్వరరావు కుటుంబానికి గ్రామ జనసేన యూత్ ఆర్థిక సాయం అందించింది. సర్పంచ్ తోట భవానీ, ఎంపీటీసీ తోలేటి సంతోషి నేతృత్వంలోని పార్టీ శ్రేణులు మృతుడు నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా స్పందించారు. దీంతో అభిమానుల నుంచి సేకరించిన రూ.27,500 మృతుడి కుటుంబానికి శుక్రవారం అందజేశారు.

ఓటు హక్కు పౌరుడి ఆయుధం

- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం
- పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు
- నేడు బహుమతుల ప్రదానం



కొత్తపేటలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

కొత్తపేట: ప్రజాస్వామ్య దేశంలో పౌరులకు 'ఓటు'.. ఓ 'వజ్రాయుధం'. ప్రజాస్వామ్యంలో తమను తాము కాపాడుకునేందుకు, దేశ ప్రగతికి ఓటు ఓ మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిచ్చి, ఎన్నికల్లో నోటికొచ్చినట్టు ఎక్కడ లేని హామీలిచ్చి, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించి, అవినీతే ప్రధానంగా పనిచేసే ప్రభుత్వాల పతనానికి ఓటు ఓ 'ఆయుధం'లా ఉపయోగపడుతుంది. అందుకు 18. సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై భవిష్యత్తులో ఆ వజ్రాయుధాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా చైతన్యవంతులు కావాలి.

ఓటు నమోదు ఇలా..

తహసీల్దార్ కార్యాలయాలు, వీఆర్వో, బూత్ స్థాయి అధికారుల వద్ద ఓటరు నమోదు ఫారాలు తీసుకుని వాటిని పూర్తి చేసిన అనంతరం ఆయా కార్యాలయాల్లో అందజేయాలి. నూతనంగా ఓటు హక్కు పొందే వారు ఫారం–6 కు జత చేసి ఇవ్వాలి. అలాగే ఓటు తొలగింపు, అభ్యంతరాలకు ఫారం–7, మార్పులు, చేర్పులకు ఫారం–8, ఒకే నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రం మార్పునకు ఫారం–8 ఎ లను తీసుకుని పూర్తి చేసి ఇవ్వాలి.

నియోజకవర్గాల వారీ ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పీఎస్‌లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కొత్తపేట	262	1,25,177	1,27,415	6	2,52,598
పి.గన్నవరం	212	99,942	98,649	6	1,98,597
రాజోలు	205	97,852	1,00.171	1	1,98,024
మొత్తం	679	3,22,971	3,26,235	13	6,49,219

ఏటా జనవరి 25న..

ఓటర్లను చైతన్యవంతులను చేసేందుకు ఎలక్షన్ కమిషన్ ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఓటర్లలో చైతన్యం కల్పించేందుకు నియోజకవర్గ ఎన్నికల, ఓటరు నమోదు అధికారులు, సహాయ అధికారులు (తహసీల్దార్ల) ఆధ్వర్యంలో జిల్లా, నియోజకవర్గ, మండల, బూత్ స్థాయిల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. దానిలో భాగంగా వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ వంటి పోటీలు నిర్వహించారు.

నేడు ప్రత్యేక కార్యక్రమాలు

జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నియోజకవర్గ కేంద్రం కొత్తపేటలో తహసీల్దార్ కార్యాలయం నుంచి ఓటర్లు, యువత, విద్యార్థులతో వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకూ ర్యాలీ, ఓటర్లతో ప్రతిజ్ఞ, ఆ ప్రాంగణంలో రంగవల్లుల పోటీలు అనంతరం బహిరంగసభ, కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ, సీనియర్ ఓటర్లకు సత్కారం, తదుపరి వివిధ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నారు.

ఓటు విలువ అపారమైనది



ప్రజాస్వామ్యంలో ఓటుకు ఉన్న విలువ ఎంతో అపారమైనది. ప్రతి పౌరుడూ తన ఓటుతో దేశాభ్యున్నతి సాధించడానికి దోహదపడాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటును అమ్ముకోకూడదు. ప్రతి ఓటరూ విధిగా ఓటు వేయాలి. దేశంపై తన నిబద్ధతను నిజాయితీగా ఓటు వేయడం ద్వారా నిరూపించుకోవాలి.

– పి.శ్రీకర్, ఆర్డీవో, కొత్తపేట

దేశ భవిష్యత్ నిర్ణేత ఓటరే..



దేశ భవిష్యత్తును నిర్దేశించేది ఓటరే. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కుతో మంచి పరిపాలనాదక్షులను ఎన్నుకుని సత్పరిపాలన సముపార్జించుకోగల శక్తిమంతుడు ఓటరు. దేశాభివృద్ధికి తోడ్పడే నిర్ణేత ఓటరు. కనుక ప్రతి ఓటరు నిజాయితీగా, నిష్పక్షపాతంగా ఓటును వినియోగించుకోవడం ద్వారా మంచి పరిపాలనాదక్షులను ఎన్నుకోవాలి.

– వై.రాంబాబు, తహసీల్దార్, కొత్తపేట

క్రీడోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, ప్రజాప్రతినిధులు



అంబాజీపేటలో విద్యార్థులకు షీల్డ్స్, కప్ అందిస్తున్న హెచ్‌ఎం సాయిరామ్, చైర్మన్ త్రిమూర్తులు

అయినవిల్లి: జిల్లా స్థాయి కోనసీమ క్రీడోత్సవాల్లో భాగంగా అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించిన వాలీబాల్ ఫైనల్స్ పోటీల్లో ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచి తమ ప్రతిభను కనబరిచారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జేసీ నిశాంతి, జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా చేతుల మీదుగా వీరు ట్రోఫీని గెలుచుకున్నారు. వీరి విజయానికి కృషి చేసిన పాఠశాల పీడీ ఎం.రమేష్, పాఠశాల వ్యాయామోపాధ్యాయులు కె.వెంకట్రావులను జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి, హెచ్‌ఎం ఎస్.గణేశ్వరరావు, సర్పంచ్ కుడిపూడి శాంతావతి, తదితరులు అభినందించారు.

సఖినేటిపల్లి: అమలాపురంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన కోనసీమ క్రీడోత్సవం, ఆటలతో ఆరోగ్యం పేరిట ఆటల పోటీలలో మోరి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కబడ్డీ విభాగంలో విన్నర్స్‌గా నిలిచారు. వివరాలు పాఠశాల హెచ్‌ఎం ఎస్.శ్రీధర్ కృష్ణ శుక్రవారం తెలిపారు. జిల్లా స్థాయిలో 22 మండలాల నుంచి వచ్చిన టీంలతో పోటీపడి జిల్లా స్థాయిలో కబడ్డీ విభాగంలో విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను, క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన కట్టా కృష్ణప్రసాద్, సీహెచ్ దివ్యలక్ష్మిలను ప్రముఖులు అభినందించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ జాన శంకరరావు, ఎస్ఎంసీ చైర్మన్ గుబ్బల శ్రీలక్ష్మి, సర్పంచ్‌లు పసలపూడి లక్ష్మీ పద్మమంగతాయారు, ముప్పర్తి అలివేలు గంగా త్రివేణి పాల్గొన్నారు.

అంబాజీపేట: కోనసీమ క్రీడోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో అంబాజీపేట విద్యార్థులు ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించినట్లు హెచ్‌ఎం కడలి సాయిరామ్ తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో క్రీడాకారులను శుక్రవారం అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 23 వరకు కోనసీమ క్రీడోత్సవాలను నిర్వహించారన్నారు. లాంగ్ జంప్ విభాగంలో బి.డోనేశ్వరి ప్రథమ స్థానం సాధించిందన్నారు. బాస్కెట్‌బాల్ పోటీల్లో జాతీయస్థాయి క్రీడాకారిణి నిమ్మకాలయ చరిష్మారుత్వి, కేవీఎల్ ప్రసన్న, జి.శిరమల్లి, సీహెచ్.రాజేశ్వరి, కె.సాయిశ్రీ, పి.మేఘన, ఎం.భువనేశ్వరి, పి.జాహ్నవి, బి.మానస, ఎం.నిక్సీఏంజిల్, జి.సింధూ, జె.వర్షిణి, కె.హేమశ్రీలు రన్నర్స్‌గా నిలిచారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్, స్పోర్ట్స్ టీషర్టులను బహూకరించారు. క్రీడాకారులను తీర్చిదిద్దిన పీడీ కుంపట్ల ఆదిలక్ష్మిని, క్రీడాకారులను ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, వైస్ చైర్మన్ బండారు అమ్మాజీ, ఉపాధ్యాయులు వెన్నపు సత్యనారాయణ, బొక్కా వెంకటేశ్వరరావు, బీఏ స్ఎస్ మూర్తి, ఏఎస్‌వీఎల్ రామలింగేశ్వరరావు, వి.వెంకటేశ్వరరావులు అభినందించారు.

మంచుకురిసే వేళలో..



ఉదయం 9 గంటలకు కురుస్తున్న మంచు

మంచుకురిసే వేళలో ప్రకృతి అందాలు వర్ణనాతీతం. శుక్రవారం హిమసోయగం కనువిందు చేసింది. ఇళ్లపై దుప్పటి మాదిరిగా పరచుకుంది. సూరీడు కూడా మంచు పొరలు చీల్చుకుంటూ ఉదయించి వెలుగులు ప్రసరింపచేయటానికి అష్టకష్టాలు పడ్డాడు. పచ్చని పంట పొలాలు, అందులోని పంట కూడా మంచు పరదా కనిపించింది. ఆకులు, కొబ్బరిచెట్లపై మంచు బిందువులు జారిపోతూ ప్రకృతి ఆరాధకులను మైమరపించింది. మండల కేంద్రమైన అంబాజీపేటలో ఈ సుందర దృశ్యాలు శుక్రవారం ఉదయం ఇలా దర్శనమిచ్చాయి. 9 గంటలు దాటిన మంచు తొలగకపోవడంతో వాహనదారులు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

– అంబాజీపేట.



వరిచేలను కమ్మేసిన మంచు

ప్రజాస్వామంపై అవగాహన పెంచుకోవాలి



మాక్ పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థులు

రావులపాలెం: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కును చాలా విలువైనదని ఈ వ్యవస్థ ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పలువురు వక్తలు అన్నారు. జనవరి 25 తేదీన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలో మాక్ పోలింగ్ నిర్వహించారు. నమూనా ఎన్నికల ఓటింగ్ ప్రక్రియను పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని కె.రామలక్ష్మి నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల విద్యార్థి నాయకుడు (ఎస్‌పీఎల్)ను ఎన్నుకోవడంలో సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ముగ్గుల పోటీలు

కొత్తపేట: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. తహసీల్దార్ వై.రాంబాబు, కళాశాల ప్రిన్సిపాల్ కేపీ రాజు పర్యవేక్షణలో పొలిటికల్ సైన్స్, మండల రెవెన్యూ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల టీమ్ ద్వితీయస్థానం సాధించింది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు ఉమెన్స్ కాలేజ్‌లో శుక్రవారం జరిగిన పోటీల్లో స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలు



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారులు

రావులపాలెం: 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రవాణాశాఖ అధికారులు పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంబీఏ ఓలేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ ప్యాట్రిక్ స్కూల్, చైతన్య పబ్లిక్ స్కూల్, జెడ్పీ బాలుర హైస్కూల్, సిద్ధార్థ స్కూల్, నక్షత్ర స్కూల్ తదితర పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతా అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు త్వరలో బహుమతులు అందిస్తామని ఎంబీఏ శ్రీనివాస్ తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

36వ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఈతకోట టోల్‌ప్లాజా మేనేజర్ కేవీవీఎస్ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాజేశ్వరి రామకృష్ణన్ నేత్రాలయం, లయన్స్ క్లబ్ సౌజన్యంతో ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 98 మంది డ్రైవర్లు, వాహన వినియోగదారులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవలసిన అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, ప్లాజా సిబ్బంది ప్రవీణ్, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

బాలికలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి

- ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం
- పలు అంశాలపై బాలికలకు అవగాహన



మామిడికుదురులో సేవ్ గరల్స్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బాలికలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సాయిబాబు



సఖినేటిపల్లిలంకలో వ్యక్తిగత శుభ్రతపై ర్యాలీ చేపట్టిన పిల్లలతో ప్రభావతి

కొత్తపేట: ఆత్మరక్షణ కోసం ప్రాథమిక స్థాయి నుంచీ బాలికలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు అన్నారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కళాశాలలో మహిళా సాధికారత విభాగం కన్వీనర్ సీహెచ్ఎన్ రాణి ఆధ్వర్యంలో బాలికల విద్య, అన్ని రంగాల్లో చైతన్యం అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ బాలికలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కలిగి విద్య, వివిధ అంశాల్లో ప్రథమ స్థానంలో ఉండాలన్నారు. బాలికల భవిష్యత్తుకు విద్య ఎంతో అవసరమన్నారు. తద్వారా మంచి ఉద్యోగాలు తెచ్చుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందాలన్నారు. బాలికలు చదువుకుంటే కుటుంబం తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు డీసీహెచ్ పాపారావు, డాక్టర్ కె.అంకమరావు, కె.సత్యనారాయణ, నాగదీపిక, నాగ శ్రీలక్ష్మి, హేమలత, దీపికాదేవి, ప్రసన్న జ్యోతి, భవాని, సాయిలక్ష్మి, వల్లి, కావ్య పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏపీ ఎన్జీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ గుండేపల్లి ప్రభావతి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. సఖినేటిపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో కలిసి ఈ దినోత్సవం ఆమె ఏర్పాటు చేశారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలికలకు ఆరోగ్యం, సంరక్షణ, విద్యపై అవగాహన కల్పించారు. బాలికలు అత్యవసర పరిస్థితులలో ఉపయోగించుకోవాల్సిన 1098 నంబరు ఆవశ్యకతను ప్రభావతి వివరించారు. అలాగే పిల్లలకు గుడ్ టచ్, బాడ్ టచ్ గురించి అవగాహన ఆమె కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం జి.మల్లికార్జునరావు, టీచర్ స్వర్ణలత, పీహెచ్‌సీ సిబ్బంది సరస్వతి, హాలిజా, ప్రశాంతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

రాజోలు: జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. మహిళా సాధికారిత కో–ఆర్డినేటర్ పి.శైలజ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాలికల సంరక్షణకు ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తీసుకుని వచ్చాయన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు, బాల్య వివాహాల అడ్డుకోవాలని, పలు మహిళా చట్టాల గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, అధ్యాపకులు అశ్వని, సరిత, పీఆర్వో నల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: కంటికి రూపం, ఇంటికి మణిదీపం ఆడపిల్ల అని డీవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని మామిడికుదురు మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మామిడికుదురు స్కూల్లో సేవ్ గరల్స్, సేవ్ నేషన్ స్లోగన్స్‌తో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఆలోచింపచేశారు. పాశర్లపూడిలంక, అప్పనపల్లి, పెదపట్నంలంక జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ఆడపిల్లలు లేనిదే సృష్టే లేదని నినదించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.సుబ్బలక్ష్మి, కె.విజయలత, బి.అన్నపూర్ణ, ఆయా స్కూల్స్ హెచ్‌ఎంలు కె.హరనాథ్, బి.సూర్యప్రకాశరావు, ఎన్.దుర్గాప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

అంబాజీపేట: బాలికల పట్ల చిన్నచూపు తగదని, బాలికల చదువు ఇంటికి వెలుగని, అభివృద్ధి సూచికని హెచ్‌ఎం కడలి సాయిరామ్, మహిళా పోలీస్ జి.దుర్గాదేవి అన్నారు. మాచవరం, మొసలపల్లి పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాలికలు ఆత్మరక్షణ కోసం ఇప్పటి విద్యార్థినులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్‌లలో వచ్చే మోసపూరిత యాప్‌లను చూసి మోసపోవద్దన్నారు. కిశోర బాలికల దశలో ఉన్న విద్యార్థులకు వచ్చే సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల వితరణ

ఆలమూరు: గ్రామంలోని ఖండ్రిగ పాఠశాలలో విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, భోజన ప్లేట్ల పంపిణీ జరిగింది. బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలమూరు, కొత్తపేట కోర్టు ఏజీపీ బూసి ప్రసన్న వాటిని విద్యార్థులకు బహూకరించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయులు అద్దరి శ్రీనివాసరావు, ముప్పిరి వెర్రియ్య, దిద్దిరాము తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



శానపల్లికలంకలో రైల్వే లైన్ ట్రాక్ పనుల మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్

అయినవిల్లి: కోటిపల్లి–నరసాపురం రైల్వే లైన్, రైల్వే ట్రాక్ ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని శానపల్లిలంకలో రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు పిల్లర్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైల్వే లైన్ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ రికార్డులు రైల్వే ట్రాక్ అలైన్మెంట్లును మ్యాప్ ఆధారంగా పరిశీలించి అధికారులతో చర్చించారు. ఆయనను కలసిన రైతులు తమ సమస్యలను ఆయన దృష్టి తీసుకొచ్చారు. రైతుల సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కారానికి తగు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి పి.శ్రీకర్, స్థానిక తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎంఎస్ రాయుడు పాల్గొన్నారు.

మెగా కంటి వైద్య శిబిరం



సఖినేటిపల్లిలంకలో నిర్వహించిన ఉచిత మెగా ఐ క్యాంపు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక దత్తత గ్రామంలో హైదరాబాద్ కేంద్రంగా ఉన్న గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా ఐ క్యాంపు శుక్రవారం నిర్వహించారు. ఫౌండేషన్ నియోజకవర్గ కన్వీనర్ జంపన బుజ్జిరాజు ఆధ్వర్యంలో ఈ క్యాంపును ఏర్పాటు చేశారు. గ్రామస్తులతో పాటు సరిహద్దు గ్రామస్తులు సుమారు 325 మందికి కంటి వైద్య పరీక్షలు వైద్యులు చేశారు. 112 మంది రోగులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 25 మందికి కంటి ఆపరేషన్లకు వైద్యులు సిఫారసు చేశారు. వీరందరినీ వేమగిరి కంటి ఆసుపత్రికి ఫౌండేషన్ ప్రతినిధులు పంపారు. ప్రముఖులు దాట్ల గోపీరాజు, ఆత్రేయపురం ప్రసాదరాజు, వెంప వర్మ, గోడిలంక లక్ష్మీపతిరాజు, రేపూరి ఏసునరసింహరాజా, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

మలికిపురం: మండలంలోని శంకరగుప్తంలో శుక్రవారం లక్కవరం పశువైద్య శాల అధికారులతో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ రాపాక ఆనందకుమార్ శిబిరం ప్రారంభించారు. వైద్యాధికారి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో సిబ్బంది పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. 250 కోళ్లకు, 30 మేకలకు నట్టల నివారణ మందులు అందించారు. ఎంపీటీసీలు ఆచంట మాణిక్యం, మానుకొండ ప్రమీల, సిబ్బంది సీహెచ్ ముఖేశ్, ఎన్.సంజీవరావు, కె.విజయ్, బి.సురేష్, శేషు పాల్గొన్నారు.

దోమలను అరికట్టాలి

అంబాజీపేట: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే దోమలను అరికట్టవచ్చని, అందుకు అందరూ సహకరించాలని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ బి.అప్పారావు అన్నారు. మాచవరం కుమ్మర్లవీధిలోను, ఇసుకపూడిలోను డ్రైడే.. ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా దోమల నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. అప్పారావు మాట్లాడుతూ ఇంటి వద్ద ఉన్న మురుగు నీటి కాలువలు, బోదెలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. నివాస ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండాను, చెత్త, చెదారం ఉండకుండా చూడటం వల్ల దోమల ఉధృతి తగ్గుతుందన్నారు. దోమల వల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలు వచ్చే అవకాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ వి.మురళీకృష్ణ, ఏఎన్ఎం లక్ష్మీభాయి, ఎంఎల్‌హెచ్‌పీ టీనా, ఆశాలు పాల్గొన్నారు.

ఏడుగురు వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు

పి.గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించిన ఏడు గ్రామాల వీఆర్వోలకు ఉన్నతాధికారుల ఆదేశాలతో తహసీల్దార్ పి.శ్రీపల్లవి సోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండలంలోని పి.గన్నవరం, ఎల్.గన్నవరం, మానేపల్లి, మొండెపులంక, బెల్లంపూడి, ఊడిమూడి, జి.పెదపూడి గ్రామాల్లో అక్రమార్కులు విచ్చల విడిగా ఇసుకను, మట్టిని అక్రమంగా తరలించుకు పోతున్నారని ఇటీవల పత్రికల్లో కథనాలు వచ్చిన విషయం విదితమే. అలాగే జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు పలువురు నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ మౌఖిక ఆదేశాలతో తహసీల్దార్ ఆయా గ్రామాల వీఆర్వోలకు తహసీల్దార్ సోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నప్పటికీ మీరు ఎందుకు నిలుపుదల చేయలేదో లిఖితపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని వీఆర్వోలను ఆమె ఆదేశించారు. మండలంలో ఎక్కడా కూడా ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా జరగకుండా చూడాలని వీఆర్వోలను ఆదేశించారు. ఇసుక అక్రమాలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, అవసరమైతే విధుల నుంచి తొలగిస్తామని కలెక్టర్ హెచ్చరించినట్లు తహసీల్దార్ ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.